సాక్షి ములుగు

శుక్రవారం | 23 | ఆగస్టు | 2024



క్రీడలపై ఆసక్తి పెంచాలి

విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలపై ఆసక్తి కలిగేలా ఫిజికల్ డైరెక్టర్లు కృషి చేయాలని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ పి. మల్లారెడ్డి కోరారు. - 8లో▸



ప్రజా ఉద్యమాలతోనే పార్టీ పటిష్టం

ప్రజా ఉద్యమాలతోనే పార్టీ పటిష్టమవుతుందని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
32.1°/26.4°

వాతావరణం

జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఉంటుంది. రాత్రి పలు చోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్ పర్యటన

ఏటూరునాగారం: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత తొలిసారిగా ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్ జిల్లాలో నేడు(శుక్రవారం) పర్యటించనున్నారు. ఉదయం మేడారంలో సమ్మక్క–సారలమ్మలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం ఏటూరునాగారం ఐటీడీఏకు చేరుకొని ఐటీడీఏ పరిధిలోని సెక్టార్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తారు. ఆ తర్వాత అక్కడి నుంచి భద్రాచలం ఐటీడీఏకు వెళ్లనున్నారు.

'బాల పురస్కార్'కు దరఖాస్తు చేసుకోవాలి

ములుగు : అసమాన ధైర్య సాహసాలు ప్రదర్శించిన ప్రతిభావంతులైన బాలలు ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత లెనినా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకోదలిచిన వారు 5నుంచి 18సంవత్సరాలు ఉండాలని తెలిపారు. బాలల తరఫున తల్లిదండ్రులు కానీ, బాలల సంరక్షణకు కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థలు సైతం దరఖాస్తులు సమర్పించవచ్చని వివరించారు. నూతన ఆవిష్కరణలు, సామాజిక సేవ, క్రీడలు, కళలు, శాస్త్రీయ, సాంకేతిక అంశాలలో ప్రతిభ కలిగిన వారు దరఖాస్తులు చేయవచ్చని తెలిపారు. అర్హులు హెచ్‌టీటీపీఎస్://అవార్డ్స్.జీఓవి.ఇన్ వైబ్‌సైట్‌లో ఆగస్టు 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్ నంబర్ 9440615158లో సంప్రదించాలని సూచించారు.

బదిలీలకు దరఖాస్తు చేసుకోవాలి

ములుగు రూరల్: రాష్ట్రంలో సమగ్రశిక్షా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విధులు నిర్వహిస్తున్న స్పెషల్ ఆఫీసర్‌లు, పీజీ సీఆర్టీలు, సీఆర్టీలు, పీఈటీలు ఏఎన్ఎంలు, అకౌంటెంట్లు ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు బదిలీల కోసం దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ పాణిని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురు, శుక్రవారం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకుని శనివారం సంబంధిత ప్రతులను డీఈఓ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. అభ్యర్థులు హెచ్‌టీటీపీఎస్://ట్రాన్స్‌ఫర్స్.సీడీఎస్‌ఈ. తెలంగాణ. జీఓవి.ఇన్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. బదిలీలకు సంబంధించిన పూర్తి ప్రక్రియ ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారని సమాచారం సైతం ఆన్‌లైన్‌లోనే పొందుపరుస్తారని వివరించారు.

జిల్లా వ్యవసాయ అధికారికి సన్మానం



ములుగు రూరల్: ములుగు జిల్లా వ్యవసాయ అధికారిగా నూతన బాధ్యతలు చేపట్టిన సురేష్‌ను కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. జిల్లా కేంద్రంలోని డీఏఓ కార్యాలయంలో గురువారం ఆయనను శాలువాలతో సన్మానించి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్ మాట్లాడారు. జిల్లా రైతులకు అందుబాటులో ఉండి వ్యవసాయ రంగ సమస్యలను నివృత్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాకిట రామకృష్ణారెడ్డి, శ్రీనివాస్, దేవయ్య, భిక్షపతి పాల్గొన్నారు.

విధుల్లో చేరిన ఏపీఓ భీంరావు



ఏటూరునాగారం: సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ)అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ జనరల్(ఏపీఓ) భీంరావు గురువారం ఏటూరునాగారంలో విధుల్లో చేరారు. ఇక్కడ పనిచేసిన వసంతరావు ఉట్నూరు ఐటీడీఏకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఉట్నూరులో ఏపీఓగా పనిచేసిన భీమ్‌రావు ఏటూరునాగారానికి బదిలీపై వచ్చి విధుల్లో చేరారు.

మెరుగైన విద్యను అందించాలి

కన్నాయిగూడెం: ప్రీస్కూల్ ద్వారా పిల్లలకు మెరుగైన విద్యను అందించాలని ఏటూరు నాగారం సీడీపీఓ ప్రేమలత అన్నారు. మండల పరిధిలోని విద్యా వనరుల కేంద్రంలో మూడు రోజుల పాటు అంగన్ వాడీ టీచర్లకు సీడీపీఓ ప్రేమలత ఆధ్వర్యంలో ఈసీసీ ట్రైనింగ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పిల్లలకు ప్రీస్కూల్ ద్వారా ఎలా పాఠాలు బోధించాలి, టైం టేబుల్ వంటి విధానాలపై శిక్షణ ఇచ్చినట్లు ప్రేమలత తెలిపారు. పాఠ్యాంశాలకు అనుగుణంగా కొత్త ప్రణాళికలు తయారు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కమల, పుష్పవతి, టీచర్లు రమాదేవి, లలిత పాల్గొన్నారు.

'తీజ్' సంబురం

తండాల్లో ఘనంగా వేడుకలు

- ఆడిపాడిన గిరిజన యువతులు
- ములుగులో భారీ ర్యాలీ, నిమజ్జనం

పాపయ్యపల్లిలో బుట్టలు ఎత్తుకున్న యువతులు



ములుగు/గోవిందరావుపేట: గిరిజన లంబాడా తండాలలో ప్రతీ ఏడాది ప్రకృతి పండుగగా జరుపుకునే తీజ్ వేడుకలను గురువారం ఘనంగా జరుపుకున్నారు. జిల్లా కేంద్రంతో పాటు రామచంద్రాపురం, పాపయ్యపల్లి, బాలాజీ నగర్, అన్నంపెల్లితో పాటు ఆయా ప్రాంతాల తండావాసులు ఆనందంగా జరుపుకున్నారు. గత ఆదివారం జెండా ఆవిష్కరించడం, మంగళవారం సీత్లాభవానికి నైవేద్యం సమర్పించడం, బుధవారం నవధాన్యాలను బుట్టలో వేసి నారు కోసం సిద్ధం చేయడం వంటి పనులతో సందడిగా గడిచింది. వారం రోజుల తర్వాత బుధవారం తీజ్ పండుగ మొదలైంది. సాయంత్రం గణగోర్ నిర్వహించారు. గురువారం ఉదయం తండాల్లో వేడుకలు కొట్టొచ్చినట్టుగా కనబడ్డాయి. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన బంధువులు యువతులు, యువకులు నూతన వస్త్రాలు ధరించి సందడి చేశారు. సాయంత్రం ఇంటి పెద్దమనిషి ముందు ఖాళీ జాగలో కట్టిన తీజ్ వద్ద డప్పు చప్పులతో సాంప్రదాయ నృత్యాలు చేశారు. ములుగు జిల్లా కేంద్రంలో భారీగా ర్యాలీ తీస్తూ తీజ్ నిమజ్జనానికి బయలుదేరడంతో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. స్పందించిన పోలీసులు అక్కడికి చేరుకొని క్లియర్ చేశారు.



తీజ్ ఉత్సవాల్లో యువతులు

ఆటపాటలతో..

ఆటపాటల మధ్య పలువురు మహిళలు స్వయంగా డోలు వాయిస్తూ హోరెత్తించారు. నాచ్ బాయి నాచ్ హుసేతి నాచ్ అంటూ ఒకరినొకరు ఆట పట్టిస్తూ పాటలతో అలరించారు. సాయంత్రానికి సమీపంలోని చెరువులో అమ్మవారిని నిమజ్జనం చేశారు. సోదరులు తమ సోదరి కాళ్లను కడిగి ఆశీర్వాదం తీసుకున్నారు. ఏడాదంతా పచ్చగా ఉండాలని పంటలు సమృద్ధిగా పండాలని ఇంటిల్లిపాది ఆరోగ్యాలతో సల్లగా ఉండేలా దీవించాలని తీజ్ మాతను కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవిందనాయక్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు జంపన్న, సర్వన్ కుమార్, పోరిక జయరాం, సునీల్, రాహుల్ నాయక్, బానోత్ దేవేసింగ్, పాడియా కుమార్, విష్ణుకుమార్, అజయ్, చంటి, షణ్ముఖ, రవి, తదితరులు పాల్గొన్నారు.



వేతన వెతలు

ఓపీఎస్‌లకు ఐదు నెలలుగా అందని జీతాలు

- ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు
- పట్టించుకోని ప్రభుత్వం



మంగపేట: జిల్లాల్లో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో గ్రామపంచాయతీ కార్యదర్శులు(ఓపీఎస్)గా విధులు నిర్వహిస్తున్న వారికి ప్రభుత్వం వేతనాలు చెల్లించక పోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 174 గ్రామపంచాయతీలు ఉండగా 21మంది అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పంచాయతీ కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తున్నారు. ఒక్కొక్కరికి నెల వేతనం రూ.18 చెల్లించాల్సి ఉండగా అన్ని కటింగ్‌లు పోను రూ.12,500 వరకు వచ్చే వేతనంతో జీవనం కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే వేతనం ఇంటి అద్దె, కుటుంబ పోషణకు ఎటూ సరిపోవడం లేదని దీంతో విధులు నిర్వహించడం తీరని భారంగా మారిందని వాపోతున్నారు.

ఒక్కొక్కరికి రావాల్సింది రూ.90వేలు

చాలీచాలని వేతనాలతో కుటుంబాలు గడవడమే కష్టం. ఇలాంటి పరిస్థితుల్లో ఐదు నెలలుగా వేతనాలు రాకపోవడంతో అప్పులు చేసి కుటుంబాలను నెట్టుకొస్తున్నామని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఒక్కో కార్యదర్శికి నెలకు రూ.18వేల చొప్పున 5నెలలకు రూ.90 వేల చొప్పున వేతనం రావాల్సి ఉంది. ఇలా 21మందికి రూ.18.90 లక్షల వేతనాలను ప్రభుత్వం అవుట్ సోర్సింగ్ కార్యదర్శులకు చెల్లించాల్సి ఉంది.

ఉద్యోగం చేయలేక పోతున్నాం..

ఐదు నెలలుగా వేతనాలు రాకపోవడంతో ప్రభుత్వం నుంచి పంచాయతీలలో రోజువారీగా పనులు, ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించేందుకు సరిపడా నిధులు కూడా జీపీలకు విడుదల చేయకపోవడంతో పంచాయతీల నిర్వహణ కూడా కష్టతరంగా మారిందని వాపోతున్నారు. ఒక పక్క వేతనాలు రాకపోవడం మరో పక్క పంచాయతీల నిర్వహణలో భాగంగా ట్రాక్టర్ల రిపేరు, డీజిల్, పారిశుద్ధ్యం పనుల నిర్వహణకు రోజువారీగా కూలీలకు డబ్బులు, కుటుంబ ఆర్థిక అవసరాలకు, పంచాయతీ నిర్వహణకు తప్పని పరిస్థితుల్లో అప్పులు చేశామని చెబుతున్నారు. ఇప్పుడు ఇచ్చిన అప్పు తీర్చమని తమపై ఒత్తిడి చేస్తున్నారని.. దీంతో ఉద్యోగం వదిలేస్తే బాగుండని అనిపిస్తుందని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యలపై ఉన్నతాధికారులను ప్రశ్నించే ధైర్యం లేక, ఎవరికీ చెప్పుకోలేక లోలోన కుమిలిపోతూ ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమకు రావాల్సిన ఐదు నెలల వేతనాలు చెల్లించాలని కోరుతున్నారు. ఈ విషయంపై వివరణ కోరేందుకు జిల్లా ఇన్‌చార్జ్ పంచాయతీ అధికారి, జిల్లా పరిషత్ సీఈఓ సంపత్‌రావుకు ఫోన్ చేయగా ఆయన స్పందించ లేదు.

రుణమాఫీని ఎగ్గొట్టే ప్రయత్నం



జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

- నిబంధనలతో పేరుతో రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం
- జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి

ములుగు: కాంగ్రెస్ ప్రభుత్వం నిబంధనల పేరుతో రుణమాఫీని ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తే రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి అన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కేసీఆర్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో గురువారం రైతు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ టీఎస్.దివాకరను కలిసి రైతు సమస్యలు, రుణమాఫీపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాగజ్యోతి మాట్లాడుతూ గత సంవత్సరం డిసెంబర్ 9లోగా రుణమాఫీ చేస్తామని హామీనిచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. ఇప్పటి వరకు కనీసం 45శాతం మందికి కూడా రుణమాఫీ జరగలేదన్నారు. రుణం ఇచ్చిన రోజున లేని నిబంధన మాఫీ ఇచ్చేటప్పుడు ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఇచ్చిన హామీ మేరకు వందశాతం రుణమాఫీ చేసి తీరాలని డిమాండ్ చేశారు. ఈ కార్య క్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పాలెపు శ్రీనివాస్, కందకట్ల సారయ్య, భూక్యా జంపన్న నాయక్, విజయరామ్ నాయక్, దాసరి రమేష్, కుమార్, ప్రభాకర్, ఉమా, భాస్కర్, గండి కుమార్, చంద్రమౌళి, మోహన్, ఆదిరెడ్డి, బాబు, హుస్సేన్, అమర్ సింగ్, రాజన్న, అంకూస్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

- మరిన్ని ఫొటోలు 9లో▸

పారదర్శకంగా ఓటరు జాబితా రూపొందించాలి



ఓటరు జాబితాపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్, పక్కన అదనపు కలెక్టర్ శ్రీజ తదితరులు

కలెక్టర్ టీఎస్.దివాకర

ములుగు: రాబోయే గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు పారదర్శకంగా ఓటర్ జాబితాను రూపొందించాలని కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, ఎంపీవోలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పంచాయతీ ఎన్నికలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో ఓటరు జాబితాను రూపొందించడంపై ఎన్నికలు నిర్వహించే అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో రూపొందించిన ఓటరు జాబితా ఆధారంగా గ్రామ పంచాయతీ ఓటరు లిస్ట్ తయారు చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్ టీ–పోల్‌లో గ్రామ పంచాయతీ ఓటరు జాబితా నుంచి వార్డుల వారీగా మ్యాపింగ్ చేయాలని సూచించారు. ఎన్నికల్లో విధులు నిర్వహించనున్న ప్రతిఒక్కరూ ఎలక్షన్ పనులను ప్రణాళికతో పూర్తి చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో పొరపాట్లు జరగకుండా టి–పోల్‌లో ఓటరు లిస్ట్ మెర్జింగ్ జాగ్రత్తగా చేయాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని అధికారులను హెచ్చరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీజ, అన్ని మండలాల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

శ్రావణ్‌కు ఉత్తమ ఫొటోగ్రాఫర్ అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న శ్రావణ్

వెంకటాపురం(ఎం): మహారాష్ట్రలోని థానే పట్టణంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా జర్నలిస్టు సంఘం నిర్వహించిన జాతీయస్థాయి పోటీలలో మండలంలోని పాలంపేటకు చెందిన తడాండ్ల శ్రావణ్ పండుగ విభాగంలో ఉత్తమ ఫొటోగ్రాఫర్‌గా ఎంపికయ్యాడు. పార్లమెంటు సభ్యులు మాస్కే నరేష్, సంజయ్ కేల్కర్, పద్మశ్రీ సుధాకర్ ఓవాలే చేతుల మీదుగా ఉత్తమ ఫొటోగ్రాఫర్ అవార్డును గురువారం అందుకున్నట్లు శ్రావణ్ తెలిపారు.

'పదోన్నతుల్లో జరిగిన అవకతవకలను సరిచేయాలి'



ఏడీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మంగపేట: గిరిజన సంక్షేమశాఖ ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల కౌన్సెలింగ్‌లో జరుగుతున్న ఇబ్బం దులు, అవకతవకలను సరిచేయాలని కోరుతూ హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమశాఖ ఏడీ సర్వేశ్వర్ రెడ్డిని కలిసి గురువారం వినతిపత్రాన్ని అందజేసినట్లు ఆ సంఘం నాయకులు జబ్బ రవి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఏల బదిలీల వెబ్‌ఆప్షన్లలో కోరుకున్న స్థానాలు రానివారి కోసం, సీనియర్లకు జరిగిన అన్యాయాలను సరిచేయాలని కోరినట్లు తెలిపారు. ఖాళీగా ఉన్న స్థానాల్లో వారిని సర్దుబాటు చేయాలని కోరినట్లు తెలిపారు. వీటిపై స్పందించిన ఆయన బదిలీల్లో జరిగిన పొరపాట్లను సరిచేస్తామని వెల్లడించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ ఉపాధ్యాయ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పాదెం కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు తప్పని తిప్పలు

ఆర్టీసీ బస్సులు సకాలంలో రాక గంటల తరబడి నిరీక్షణ

ఏటూరునాగారం: ఆర్టీసీ బస్సులు ఏటూరు నాగారం ఆర్టీసీ బస్టాండ్‌కు సకాలంలో రాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గురువారం ఉదయం నుంచి వందలాది మంది ప్రయాణికులు బస్టాండ్‌లో వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు గంటల తరబడి నిరీక్షించారు. ఆర్టీసీ బస్సు ఫ్రీ కావడంతోనే బస్సులను తగ్గించి నడుపుతున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. రాఖీ పౌర్ణమితో పాటు వరుస సెలవులు రావడంతో పట్టణాల నుంచి విద్యార్థులు, ఆడపడుచులు తమ స్వగ్రామాలకు చేరుకున్నారు. తిరుగు ప్రయాణంలో బస్సులు లేక బస్టాండ్‌లో గంటల తరబడి వేచి చూశారు. అయినప్పటికీ ఆర్టీసీ కంట్రోలర్, అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ సర్వీసులను పెంచి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.



ఏటూరునాగారం బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు



రెండు గంటల నుంచి చూస్తున్నా..

నాది మణుగూరు. హనుమకొండ పోవడానికి ఏటూరునాగారం వచ్చినా. ఇక్కడి నుంచి హనుమకొండకు ఎలాంటి వాహనాలు లేవు, బస్టాండ్‌లో రెండు గంటల నుంచి చూస్తున్నా ఒక్క బస్సు రాలేదు. చేసేది లేక ప్రైవేట్ వాహనంలో పోతున్నాను. బస్సులు రాక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

- నవదీప్‌రెడ్డి, విద్యార్థి, మణుగూరు

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

ఎస్పీ శబరీశ్

ములుగు: ర్యాగింగ్‌కి పాల్పడినా, ప్రోత్సహించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ శబరీశ్ అన్నారు. ఈ మేరకు తన కార్యాలయంలో గురువారం యాంటీ ర్యాగింగ్ వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల్లో చదువుకునే సీనియర్ విద్యార్థులు తమ జూనియర్ విద్యార్థులను వేధించడం, దూషించడం, కొట్టడం, అగౌరవపరచడం, మానసికంగా, శారీరకంగా, లైంగికంగా వేధించడం, అమర్యాదగా ప్రవర్తించడం నేరపూరిత లక్షణాలు అన్నారు. ఇతరుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ప్రవర్తించడం, ఆర్థిక దోపిడీ, డబ్బులు లాక్కోవడం, బలవంతంగా ఖర్చు పెట్టించడం వంటి చర్యలు ర్యాగింగ్‌గా పరిగణించబడుతాయని తెలిపారు. పాఠశాల, కళాశాలలో ర్యాగింగ్‌కి పాల్పడితే అడ్మిషన్ రద్దు చేయడంతో పాటు సస్పెండ్‌కు గురవుతారని హెచ్చరించారు. పోలీస్ విచారణకు గురి అవుతారని, నిరూపణ అయితే ర్యాగింగ్ చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. తోటి విద్యార్థులను గౌరవించి తల్లిదండ్రుల ఆశయాలను అనుగుణంగా ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. ర్యాగింగ్ నియంత్రణకు పాఠశాలలు, కళాశాల వద్ద మఫ్టీలో పోలీస్ నిఘా పెట్టామన్నారు. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే సెల్ నంబర్ 8712670120కి కాల్ చేసి సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డీ మహేష్ బాబాసాహెబ్ గితే, డీఎస్పీ రవీందర్, ఆర్ఐ అడ్మిన్ వెంకటనారాయణలు పాల్గొన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు ములుగు ఎస్సై వెంకటేశ్వర్లు ఇంచర్ల, ములుగు ఆర్టీసీ బస్టాండ్‌లలో వాల్ పోస్టర్లను అతికించారు.



యాంటీ ర్యాగింగ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ

చదువుతోనే పేదరికం దూరం

ఏఎస్పీ శివం ఉపాధ్యాయ

కన్నాయిగూడెం: చదువుతోనే పేదరికం దూరమవుతుందని ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ అన్నారు. మండల పరిధిలోని ఐలాపూర్ గ్రామ పరిధిలోని గొత్తికోయగూడెంలో స్థానిక ఎస్సై ఇనిగాల వెంకటేశ్ ఆధ్వర్యంలో గురువారం ఏఎస్పీ 40మంది పిల్లలకు పలకలు, పెన్నులు, పెన్సిళ్లు, రబ్బర్లు, ఏరైజర్లు, నోట్‌బుక్స్, బట్టలు మొదలగు వస్తువులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ పిల్లలను పనులకు పంపొద్దని సూచించారు. చదువుకునేందుకు పాఠశాలకు మాత్రమే పంపాలని అవగాహన కల్పించారు. చదువుతోనే పేదరికం దూరమవుతుందని వివరించారు. ప్రతిఒక్కరూ చదువుకునేలా చూడాలన్నారు. గ్రామంలోకి ఎవరైన కొత్త వ్యక్తులు వస్తే సహకరించొద్దని తెలిపారు. నిషేధిత మావోయిస్టులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఏవైనా సమస్యలు ఎదురైతే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం సీఐ శ్రీనివాస్, సివిల్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



పలకలు, నోట్‌బుక్స్ అందుకున్న చిన్నారులతో ఏఎస్పీ, పోలీస్ సిబ్బంది

ముగిసిన పొట్టపండుగ


అమ్మవార్ల గద్దెల నుంచి సమ్మక్క గుడికి వస్తున్న పూజారులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారంలో పొట్ట పండుగ పూజా కార్యక్రమాలు ముగిశాయి. బుధవారం రాత్రి సమ్మక్క గుడి నుంచి పసుపు, కుంకుమ, పూజాసామగ్రి, కొత్తగా పొట్టకు వచ్చిన ధాన్యాలను తీసుకుని పూజారులు సమ్మక్క– సారలమ్మ గద్దెల వద్దకు వెళ్లారు. అమ్మవార్ల గద్దెల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి రాత్రింతా జాగారాలతో సంబురాలు చేసుకున్న పూజారులు.. గురువారం ఉదయమే గద్దెల నుంచి సమ్మక్క గుడికి చేరుకున్నారు. గుడిలో అమ్మవారికి పొట్టకు వచ్చిన ధన్యాలను నైవేద్యంగా సమర్పించి పూజలు చేశారు. అమ్మవారికి సమర్పించిన తర్వాత పూజారులు కొత్త ధాన్యాలు స్వీకరించారు. రెండు రోజులు జరిగిన పొట్ట పండుగ పూజా కార్యక్రమాలతో మేడారంలో సందడి కనిపించింది.

ముంబయిలో నష్కల్ యువకుడి మృతి


వినయ్(ఫైల్)

చిల్పూరు: మండలంలోని నష్కల్ గ్రామానికి చెందిన వడ్లకొండ వినయ్‌కుమార్‌గౌడ్(35) బుధవారం ముంబయిలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుడి తల్లిదండ్రులు వడ్లకొండ శంకర్, మణెమ్మ కథనం ప్రకారం.. వినయ్‌కుమార్ గౌడ్ ఆరునెలల క్రితం మిత్రులతో కలిసి ముంబయి వెళ్లాడు. 15 రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చి తిరిగి ముంబయి వెళ్లాడు. ఈ సమయంలో ముంబయిలో తాను బాగానే ఉన్నానని తల్లిదండ్రులకు తెలిపాడు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున అక్కడ ఉండే తమ బంధువులు.. వినయ్‌కుమార్ గౌడ్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. కాగా, ముంబయి పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని గురువారం రాత్రి విమానంలో హైదరాబాద్‌కు పంపారు. శుక్రవారం వినయ్‌కుమార్ గౌడ్ అంత్యక్రియలు నిర్వహిస్తామని తల్లిదండ్రులు రోదిస్తూ తెలిపారు.

జ్వరంతో పాతతండాలో వ్యక్తి..


చీన్యా(ఫైల్)

కేసముద్రం: జ్వరంతో బాధపడుతున్న ఓ వ్యక్తి.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం పాతతండాజీపీలో చోటుచేసుకుంది. తండావాసుల కథనం ప్రకారం..పాతతండాకు చెందిన ఇస్లావత్ చీన్యా(65) జీపీలో వాటర్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న చీన్యాకు పదిహేను రోజుల క్రితం జ్వరం వచ్చింది. దీంతో స్థానిక వైద్యుల వద్ద చికిత్స పొందాడు. పరిస్థితి విషమించడంతో బుధవారం 108లో మానుకోట జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి ఖమ్మంలోని ఓప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య రంగమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇదిలా ఉండగా 'సాక్షి'లో ఈనెల 18న 'మంచంపట్టిన పాతతండా' అనే శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే.

ఆర్టీసీలో సెమీ డీలక్స్

వరంగల్ రీజియన్‌కు నాలుగు బస్సులు
- మహిళా ప్రయాణికుల ఒత్తిడి తట్టుకునేందుకు మధ్యేమార్గం
- వరంగల్–2 డిపోనకు కేటాయింపు
- ఉచిత ప్రయాణానికి నో ఛాన్స్



వరంగల్-2 డిపోనకు అలాట్ చేసిన సెమీ డీలక్స్ బస్సు


బస్సు లోపలి భాగం

హన్మకొండ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 'మహాలక్ష్మి' పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. దీంతో ఈ బస్సులు మహిళా ప్రయాణికులతో కిక్కిరిసి నడుస్తున్నాయి. అయితే చార్జీలు చెల్లించి వెళ్లే పురుష ప్రయాణికులకు ఈ బస్సులో ఏ మాత్రం అవకాశం లభించడం లేదు. ఫలితంగా వారు డీలక్స్, సూపర్ లగ్జరీ, ఏసీ బస్సుల్లో ప్రయాణించాల్సిన తప్పనిసరి పరిస్థితులు నెలకొన్నాయి. సామాన్య ప్రజానీకానికి డీలక్స్, సూపర్ లగ్జరీ, ఏసీ బస్సుల్లో అధిక చార్జీలు చెల్లించి ప్రయాణించే స్థితి ఉండదు. అలాగే, ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు బస్సుల్లోనూ ఎక్కలేని పరిస్థితులున్నాయి. దీంతో పురుష ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. అయితే ఆర్టీసీ.. ప్రయాణికులను దూరం చేసుకోవద్దనే ఆలోచనతో మధ్యే మార్గంగా సెమీ డీలక్స్ బస్సులు ప్రవేశపెట్టింది. ఇందులో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం ఉండదు. చార్జీ చెల్లించాల్సి ఉంటుంది.

ఎక్స్‌ప్రెస్ కంటే ఎక్కువ, డీలక్స్ కంటే తక్కువ చార్జీ..

ఎక్స్‌ప్రెస్ బస్సులు పెంచినా వాటికి ఉచిత ప్రయాణం కల్పించాల్సిన తప్పనిసరి పరిస్థితుల్లో సామాన్య, మధ్యతరగతి ప్రజలపై భారం పడకుండా ఆర్టీసీ.. సెమీ డీలక్స్ బస్సులు తీసుకొచ్చింది. ఎక్స్‌ప్రెస్ కంటే చార్జీ కొంచెం ఎక్కువ, డీలక్స్ బస్సు కంటే తక్కువ చార్జీ వర్తింపజేస్తూ వీటిని ప్రవేశపెట్టారు. వరంగల్ రీజియన్‌కు ఆర్టీసీ యాజమాన్యం ప్రస్తుతం నాలుగు సెమీ డీలక్స్ బస్సులు కేటాయించింది. వీటిని వరంగల్ రీజియన్ వరంగల్–2 డిపోకు అలాట్ చేసింది. వీటితో పాటు త్వరలో రానున్న ఎలక్ట్రిక్ బస్సుల్లోనూ సెమీ డీలక్స్ బస్సులు కావాలని వరంగల్ రీజియన్ అధికారులు కోరారు. ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు బస్సులు ఎక్కువ సంఖ్యలో తిరిగే రూట్లలో నడపాలని ఆర్టీసీ వరంగల్ రీజినల్ అధికారులు ఆలోచిస్తున్నారు. ప్రధానంగా వరంగల్–2 డిపో పరిధిలో హనుమకొండ–ఏటూరునాగారం రూట్‌లో పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు మాత్రమే నడుస్తాయి. దీంతో ఈ రూట్‌లో పురుష ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రయాణికులు ఆర్టీసీ నుంచి దూరంకాకుండా సెమీ డీలక్స్ బస్సులు నడపాలని చూస్తోంది. ఈ క్రమంలోనే ముందుచూపుతో నాలుగు సెమీ డీలక్స్ బస్సులను వరంగల్–2కు యాజమాన్యం అలాట్ చేసింది. హనుమకొండ–ఏటూరునాగారం, హనుమకొండ–భూపాలపల్లి–కాళేశ్వరం రూట్‌లో నడిపేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

ఎక్స్‌ప్రెస్‌ను పోలిన సెమీ డీలక్స్..

సెమీ బస్సు లోపలి భాగం ఎక్స్‌ప్రెస్‌ను పోలి ఉంటుంది. డీలక్స్, సూపర్ లగ్జరీ, ఏసీ బస్సులకు రెండు వైపు రెండు సీట్లు ఉంటాయి. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులకు ఒక వైపు, మరో వైపు రెండు సీట్లు ఉంటాయి. సెమీ డీలక్స్ బస్సులోనూ ఒక వైపు మూడు, మరో వైపు రెండు సీట్లు ఉంటాయి. కాగా, ఎక్స్‌ప్రెస్ బస్సు సీట్లు రెగ్జిన్‌తో తయారు చేస్తారు. సెమీ డీలక్స్ బస్సుల సీట్లు డీలక్స్ బస్సులోని సీట్ల మాదిరి ఫ్యాబ్రిక్ క్లాత్‌తో తయారు చేస్తారు. సీట్ల మోడల్‌లో కొద్ది పాటి తేడా మినహా లోపలి భాగం ఎక్స్‌ప్రెస్ బస్సును పోలి ఉంటుంది.

మధ్యస్థంగా చార్జీలు

సెమీ డీలక్స్ బస్ చార్జీలు సామాన్య, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా మధ్యస్థంగా ఉంటాయి. ఎక్స్‌ప్రెస్ బస్సుకు కిలో మీటర్‌కు రూ.1.26 చార్జీ ఉండగా డీలక్స్ బస్సుకు రూ.1.44 ఉంది. ఈ రెండింటికి మధ్యస్థంగా ఎక్స్‌ప్రెస్ కంటే కొంచెం ఎక్కువ, డీలక్స్ కంటే కొంచెం తక్కువ చార్జీ కిలో మీటర్‌కు రూ.1.37గా నిర్ణయించారు.

ప్రయాణికులు ఆర్టీసీని వదిలి వెళ్లొద్దు..

ప్రయాణికులు ఆర్టీసీని వీడి వెళ్లొద్దు. మహిళల ఉచిత బస్సు ప్రయాణంతో కొందరికి ఎదురవుతున్న అసౌకర్యాన్ని ఆర్టీసీ గుర్తించింది. అలాంటి వారికి సౌకర్యవంతమైన రవాణ కల్పించేందుకు ముందుకొచ్చింది. సామాన్య, మధ్య తరగతి ప్రజలకు భారం పడకుండా సెమీ డీలక్స్ బస్సులు ప్రవేశపెట్టింది. ఈ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణానికి అవకాశం లేదు. చార్జీ చెల్లించి ప్రయాణించే వారి కోసం ఈ బస్సులు నడుపుతున్నాం.

డి.విజయభాను
ఆర్ఎం, వరంగల్

హనుమకొండ నుంచి చార్జీల వివరాలు..
ఇలా ఉండనున్నాయి (చార్జీలు రూ.లలో)

రూట్	కిలో మీటర్లు	చార్జీలు ఎక్స్‌ప్రెస్	సెమీ డీలక్స్	డీలక్స్
ఏటూరునాగారం	111	160	180	190
మంగపేట	129	190	200	210
భూపాలపల్లి	69	100	110	110
కాళేశ్వరం	121	160	180	190

ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసం

- అంతర్రాష్ట్ర ముఠా అరెస్టు
- రూ 1.34 కోట్లు స్వాధీనం
- నకిలీ ఐడీ కార్డులు, చెక్కులు స్వాధీనం

వరంగల్ క్రైం : షేర్ మార్కెట్, వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాను అరెస్టు చేసినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. నిందితుల నుంచి నకిలీ ఐడీ కార్డులు, ప్రెస్ కార్డు, యూనియన్ బ్యాంకు మేనేజర్ ఐడీ కార్డు, నకిలీ ఆధార్, పాన్ కార్డులు, గోల్డ్ రింగ్, నకిలీ బ్యాంకు చెక్కులు, రూ.7,800 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి కథనం ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాకు చెందిన నిమిత్ కాపాసి అలియాస్ అమిత్‌కుమార్ షా, హనుమకొండ సాయినగర్ కాలనీకి చెందిన సుమన్ కాపాసి అలియాస్ కాసోజు జయ.. వివిధ కంపెనీలలో ఉద్యోగాల పేరుతో రూ.కోట్లు కాజేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, మహారాష్ట్రలోని పూణె, తెలంగాణలోని హైదరాబాద్, వరంగల్‌తో పాటు వివిధ నగరాలలో నకిలీ (సీబీఐ, బ్యాంకు మేనేజర్ కార్డులు) ఐడీ కార్డులు చూపుతూ హిందీ, ఇంగ్లిష్, గుజరాతీ, బెంగాలీ భాషల్లో అనర్గలంగా మాట్లాడుతూ అమాయకులను పరిచయం చేసుకుంటున్నారు. అనంతరం షేర్ మార్కెట్, వివిధ కంపెనీలలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ బాధితుల నుంచి రూ. 1.34 కోట్లు వసూలు చేశారు. తాజాగా జులైవాడకు చెందిన సయ్యద్ రియాజ్, ప్రవీణ్ కుమార్‌కు స్పీకింగ్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్, మ్యాట్రిమోనీ ఓవర్సీస్ కస్సల్టెన్సీ బ్యాంకు లోన్స్ విభాగంలో ఉద్యోగాలు ఇప్పిస్తామని కొంత డబ్బు వసూలు చేశాడు. ఈ డబ్బుతో గురువారం పారిపోతుండగా విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో కలిసి పోలీసులు సుబేదారిలో అరెస్టు చేసినట్లు సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపారు.

నిట్‌లో అలరించిన మ్యూజికల్ నైట్


వీణా వందన ట్రూప్ ప్రదర్శన

కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్‌లోని అంబేడ్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన 'స్పిక్ మే కే' మ్యూజికల్ నైట్ అలరించింది. దేశ సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందజేసేందుకు, యువతకు శాస్త్రీయ సంగీతం పరిచయం చేసేందుకు ఏటా నిట్ వరంగల్‌లో 'స్పిక్ మే కే' పేరిట మ్యూజికల్ నైట్ నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఈ ఏడాది వీణా వందన ట్రూప్ సారథ్యంలో వీణా, వయోలిన్ విద్వాంసులు, డి.శ్రీనివాస్, పవన్‌సింగ్, మృదంగ కళాకారుడు రామకృష్ణ ప్రదర్శించిన శాస్త్రీయ సంగీతం ఆకట్టుకుంది. కార్యక్రమంలో నిట్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాఉద్యమాలతోనే పార్టీ పటిష్టం

- సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా
- వరంగల్‌లో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ నిర్మాణ సమావేశాలు ప్రారంభం


సీపీఐ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా

న్యూశాయంపేట: ప్రజా ఉద్యమాలతోనే పార్టీ పటిష్టమవుతుందని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. ఎక్కడ సమస్యలు ఉంటే అక్కడి ప్రజలకు కమ్యూనిస్టులు గుర్తుకు రావాలన్నారు. కమ్యూనిస్టుల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని ప్రజలు విశ్వసించాలన్నారు. గురువారం సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ నిర్మాణ సమావేశాలు హనుమకొండలో ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత హరిత హోటల్ ప్రాంగణంలో పార్టీ పతాకాన్ని డి.రాజా ఆవిష్కరించారు. అనంతరం సమితి సమావేశం ప్రారంభించారు. సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అధ్యక్షతన ప్రారంభమైన సమావేశాల్లో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాగం హేమంత్‌రావు సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. అనంతరం డి. రాజా మాట్లాడుతూ దేశంలో వేగంగా జరుగుతున్న రాజకీయ పరిణామాలను వివరించారు. మతవాద, పెట్టుబడిదారి శక్తులు తీవ్రంగా చొచ్చుకొస్తున్న నేపథ్యంలో వాటిని ఎదుర్కొని సమ సమాజాన్ని నిర్మించేందుకు కమ్యూనిస్టులు కూడా మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం విద్యార్థి, యువత, కార్మిక, కర్షక, మహిళ తదితర అన్ని వర్గాలను రాజకీయంగా చైతన్యవంతం చేయాలన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలి

పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతుల రుణమాఫీ, గృహజ్యోతి, గ్యాస్ సబ్సిడీ అందరికీ అందేలా చూడాలని, ఇలాంటి విషయాలపై ప్రజావ్యతిరేకత కూడ గట్టుకోవద్దని మిత్రపక్షంగా తామ సూచనలిస్తమన్నారు. సెప్టెంబర్ 11 నుంచి 19 వరకు తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈ రాష్ట్ర కౌన్సిల్ నిర్మాణ సమావేశాల్లో పార్టీ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, మాజీ ఎంపీ అజీజ్‌పాషా, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.శ్రీనివాస్‌రావు, పశ్య పద్మ, బాగం హేమంతరావు బాలమల్లేశ్, కలవేణ శంకర్, బాల నర్సింహ, బోస్, విజయసారధి, కర్రె భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

నేతలు, ప్రముఖులకు సీపీఐ సంతాపం..

ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన సీపీఐ నేతలు, ప్రముఖులకు పార్టీ రాష్ట్ర సమితి సంతాపం తెలిపింది. హనుమకొండలో జరుగుతున్న నిర్మాణ సమావేశంలో ఈ మేరకు హేమంతరావు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది.

క్రమశిక్షణతో లక్ష్యం సాధ్యం


- ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ ఎ. వరదారెడ్డి
- సుమతిరెడ్డి కళాశాలలో ఓరియంటేషన్ ప్రోగ్రాం


జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో వరదారెడ్డి

హసన్‌పర్తి : క్రమశిక్షణతో విద్యాభ్యాసం సాగిస్తే లక్ష్యం సాధ్యమని ఎస్సార్ విద్యా సంస్థల చైర్మన్ ఎ. వరదారెడ్డి అన్నారు. నగర శివారులోని సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో బి.టెక్ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందిన విద్యార్థినులకు గురువారం ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరదారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థినులు పట్టుదలతో చదివితే భవిష్యత్ ఉంటుందన్నారు. ప్రతి విద్యార్థిని పారిశ్రామికవేత్తగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఇండియా క్యాంపస్ లీడ్ వర్చుసా హెచ్.ఆర్ డి. అభిషేక్ మాట్లాడుతూ సమాజంలో అపరిష్కృత సమస్యలను గుర్తించి వాటి పరిష్కార మార్గాలు అన్వేషించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీరెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులు సృజనాత్మక నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ సుదర్శన్, డాక్టర్ మహేందర్, డాక్టర్ వాణిశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడలపై ఆసక్తి పెంచాలి

- కేయూ రిజిస్ట్రార్ పి. మల్లారెడ్డి


మాట్లాడుతున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్: విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలపై ఆసక్తి కలిగేలా ఫిజికల్ డైరెక్టర్లు కృషి చేయాలని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ పి. మల్లారెడ్డి కోరారు. గురువారం కేయూ పరిపాలన భవనంలోని సెనేట్ హాల్‌లో నిర్వహించిన కేయూ పరిధిలోని కళాశాలల ఫిజికల్ డైరెక్టర్ల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విశ్వవిద్యాలయంలోని స్పోర్ట్స్‌బోర్డుకు ప్రత్యేకత ఉందన్నారు. స్పోర్ట్స్ క్యాలెండర్, ఇంటర్‌కాలేజియేట్ క్రీడాపోటీల నిర్వహణ, వివిధ టోర్నమెంట్లకు హాజరయ్యే క్రీడాకారులు, విజేతల వివరాలు ఎప్పటికప్పుడు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలన్నారు. యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ బి. సురేశ్‌లాల్ మాట్లాడుతూ స్పోర్ట్స్ క్యాలెండర్‌కు అనుగుణంగా క్రీడలు నిర్వహిస్తామన్నారు. కేయూ ఫైనాన్స్ ఆఫీసర్ తోట రాజయ్య మాట్లాడుతూ కేయూపరిధిలో నిర్వహించే క్రీడలకు సంబంధించిన బడ్జెట్ వివరాలు తెలపాలన్నారు. ఫిజికల్ డైరెక్టర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఫిజికల్ డైరెక్టర్ జె. సోమన్న మాట్లాడుతూ యూనివర్సిటీ క్యాంపస్‌లో వివిధ క్రీడలకు సంబంధించిన ప్లేగ్రౌండ్స్‌ను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కిట్స్ రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ రమేశ్ రెడ్డి మాట్లాడుతూ యూనివర్సిటీ పరిధిలో నిర్వహించబోయే వివిధ టోర్నమెంట్ల వివరాలను ముందుగానే సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లకు లిఖిత పూర్వకంగా తెలపాలన్నారు. ఫిజికల్‌డైరెక్టర్ సావిత్రి మాట్లాడుతూ క్రీడాకారిణులకు మహిళా కోచ్‌లు, మేనేజర్లకు వేర్వేరు వసతులు ఇవ్వాలన్నారు. అనంతరం కేయూ స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ డాక్టర్ వై. వెంకయ్య, ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ భాస్కర్, ఎస్.కుమారస్వామి మాట్లాడారు. కేయూ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఎస్పీఎం షెడ్ సిబ్బందికి శిక్షణ

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

హన్మకొండ: ఎస్పీఎం షెడ్ సిబ్బందికి నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహించాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశించారు. గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి సంస్థ పరిధిలోని జిల్లాల నోడల్ ఆఫీసర్లు, సూపరింటెండెంట్ ఇంజనీర్లు, ఎమ్మార్టీ డివిజనల్ ఇంజనీర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. డివిజన్ల వారీగా పని తీరు సమీక్షించి మాట్లాడుతూ ఎస్పీఎం షెడ్లలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఎస్పీఎం షెడ్లలో నాణ్యతాప్రమాణాలతో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు చేయాలని సూచించారు. సబ్‌స్టేషన్లను ప్రొటెక్షన్ టీంలు తరచూ తనిఖీలు చేపట్టి సమస్యలు గుర్తించి పరిష్కరించాలన్నారు. పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిల్ కాకుండా డబుల్ ఎర్తింగ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.మధుసూదన్, సీజీఎంలు కె.కిషన్, అశోక్, జీఎం అన్నపూర్ణ, డీఈలు ఉపేందర్, కె.అనిల్ కుమార్ పాల్గొన్నారు.

కోల్‌కతా ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నా..

- వరంగల్ ఎంపీ కడియం కావ్య


ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న జూనియర్ డాక్టర్లు

ఎంజీఎం : కోల్‌కతాలో పీజీ వైద్య విద్యార్థినిపై జరిగిన లైంగికదాడి, హత్య ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నానని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. లైంగికదాడి, హత్య ఘటనను నిరసిస్తూ వరంగల్ ఎంజీఎం ప్రధాన గేట్ వద్ద జూనియర్ డాక్టర్లు, వైద్య విద్యార్థులు చేస్తున్న నిరసన శిబిరాన్ని గురువారం సందర్శించి ధర్నాకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భగా ఆమె మాట్లాడుతూ కోల్‌కత్తాలో వైద్య విద్యార్థినిపై జరిగిన ఘటన అత్యంత హేయమని, బాధితురాలి కుటుంబానికి న్యాయం జరగాలన్నారు. ఈ ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. అప్పుడే ఇలాంటి ఘటనలు పునరావృతం కావన్నారు. ఈ ఘటనపై అవకాశమున్న అన్ని వేదికలపై ప్రశ్నించి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ కావ్యకు జూనియర్ డాక్టర్లు పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు.

వరంగల్ ఏసీపీ వేధింపులు

- సార్ వద్దకు వెళ్లి లావాదేవీలు సెటిల్ చేసుకోవాలని బెదిరింపులు
- కొత్తవాడకు చెందిన వృద్ధ దంపతుల కన్నీటి పర్యంతం


కుమారస్వామి, వసుంధర దంపతులు

వరంగల్ : అమెరికాలో జరిగిన లావాదేవీలు సెటిల్ చేసుకోవాలని వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ వేధింపులకు గురి చేస్తున్నారని కొత్తవాడ 80ఫీట్ల రోడ్డు సమీపంలో నివాసముంటున్న వృద్ధ దంపతులు అంకం కుమారస్వామి, వసుంధర కన్నీటి పర్యంతమయ్యారు. ఈ మేరకు గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ అమెరికా న్యూజెర్సీలో తమ రెండో కుమార్తె, అల్లుడు అమెరికన్ సిటిజన్లుగా జీవిస్తున్నారని, ఈ క్రమంలో అక్కడే ఉంటున్న హైదరాబాద్‌కు చెందిన మన్నెం రమణ తెలుగు వారితో కార్యక్రమాలు నిర్వహిస్తున్న క్రమంలో ఆయనతో పరిచయమైందన్నారు. వారి మధ్య స్నేహం ఏర్పడంతో తమ కుమార్తె వద్ద రూ. కోటి అప్పు తీసుకుని ప్రామిసరి నోట్లు రాసివ్వడమే కాకుండా మరో రూ. కోటి అమెరికాలో బ్యాంకుల్లో రుణం తీసుకుని మన్నెం రమణ తన కంపెనీలో తమ కుమార్తె, అల్లుడిని భాగస్వామ్యులుగా చేర్చారని తెలిపారు. అయితే కంపెనీకి నష్టాలు రావడంతో పెట్టుబడి పెట్టిన వారికి డబ్బులు ఇవ్వకపోవడంతో వారు ఒత్తిడి చేశారన్నారు. ఈ ఒత్తిళ్ల తప్పించుకునేందుకు మన్నెం రమణ విమానంలో ఇండియా వచ్చే క్రమంలో బ్రెయిన్ స్ట్రోక్‌కు గురికావడంతో గ్రీస్‌లో దింపారన్నారు. ఈ సమాచారం తెలుసుకున్న ఆయన భార్య గీత.. గ్రీస్‌కు వెళ్లి చికిత్స చేయించినా రమణ మృతి చెందాడన్నారు. ఫలితంగా కంపెనీపై తీసుకున్న రుణాల భారం తమ కుమార్తెపె పడిందన్నారు. దీంతో తమ కుమార్తె పేర ఉన్న ఇంటిని అప్పగిస్తామని, అప్పుల సంగతి మీరే పరిష్కరించుకోవాలని చెప్పినా గీత వినలేదన్నారు. ఈ గొడవ కారణంగా తమ కుమార్తె తమ ఇంటికి వచ్చిందన్నారు. ఈ క్రమంలో శనివారం మట్టెవాడ పోలీసులు తమ ఇంట్లో సోదాలు చేసి తమను పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారని తెలిపారు. పోలీసుస్టేషన్‌కు వెళ్లగా అక్కడ రమణ భార్య గీతతో మరో తొమ్మిది మంది ఉన్నారన్నారు. వారి ఎదుట ఏసీపీ ఇష్టానుసారంగా మాట్లాడని తెలిపారు. మురళీ సార్ దగ్గరకు వెళ్లి సెటిల్ చేసుకోవాలని ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. ఈ ఘటనపై తమకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఆత్మహత్యే శరణ్యమని కన్నీటి పర్యంతమయ్యారు. ఈవిషయంపై ఏసీపీ నందిరాంనాయక్, మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపిని వివరణ కోరగా తన కుమార్తెతో పాటు అంకం కుమారస్వామిపై గీత ఫిర్యాదు మేరకు చీటింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కేసు నిమిత్తం విచారణ కోసం ఈ వృద్ధ దంపతులను పిలిపించామన్నారు. వారి కుమార్తె వరంగల్ వచ్చాక అమెరికాలోని ప్రాపర్టీలను అమ్మిన వివరాలు తమకు అందించలేదన్నారు. మీడియాలో చూపించిన ఆధారాలు తమకు అందిస్తే న్యాయం చేస్తామని ఏసీపీ, ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

టెలికాం రంగంలో భారత్ రెండోస్థానం


సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్ రావు

కాజీపేట: ప్రపంచంలో టెలికాం రంగంలో భారతదేశం రెండవ స్థానంలో ఉందని ట్రాయ్ కాగ్ సభ్యుడు రావూరి ప్రభాకర్ రావు అన్నారు. కాజీపేట ప్రభుత్వ సాంకేతిక పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ) కళాశాలలో షేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్న టెలికాం శాఖను ప్రజలు ఆదరించాలని కోరారు. 1997లో టెలికాం వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం టెలికాం రెగ్యులేటర్ అథారిటీ ఆఫ్ ఇండియా యాక్ట్ తెచ్చినట్లు గుర్తుచేశారు. సమావేశంలో ఐటీఐ ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్ రావు బీఎస్ఎన్ఎల్ డీఈ రామ్మోహన్, ట్రైనింగ్ ఆఫీసర్ అనిల్‌కుమార్, వెంకన్న, వాసిర్, వృషాలి, మహేశ్, గీతా మేథేయి, తదితరులు పాల్గొన్నారు.